క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న టీచర్లు

శిరివెళ్ల: యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాజిదాను ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రాధానోపాధ్యాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో టీచర్లు విద్యార్థినిని సన్మానించారు. 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 573 మార్కులు సాధించి ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని కొనియాడారు. మట్టిలో మాణిక్యమని రుజువు చేసిందన్నారు.

రజకులపై దాడులు ఆపాలి

నంద్యాల(అర్బన్): కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న రజకులపై రాష్ట్రంలో దాడులు అధికమయ్యాయని, దాడులు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని ఏపీ రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి హెచ్చరించారు. పట్టణంలోని విశ్వనగర్ కార్యాలయంలో ఆదివారం సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని లింగందిన్నె గ్రామానికి చెందిన రజక శీనుపై కొందరు దాడులకు పాల్పడటం దారుణమన్నారు. రజకులపై దాడులతో పాటు మహిళలపై లైంగిక వేధింపులు రోజురోజుకు అధికమవుతున్నాయని, రక్షణ కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. రజక శీనుపై దాడికి పాల్పడిన వారిని శిక్షించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, నాగేశు, సుబ్బరాయుడు, బాలన్న, బాలమద్ది, శివుడు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ గుర్తించడంలో ప్రభుత్వం విఫలం

నంద్యాల(అర్బన్): ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక ఆచూకీ గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ విమర్శించారు. వారం క్రితం అదృశ్యమైన బాలికను గుర్తించలేకపోవడం దారుణమన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బాలికపై హత్యాచార ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారిందన్నారు. మహిళలు, బాలికలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్న హోంమంత్రి అనిత వ్యాఖ్యల్లో నిజం లేదన్నారు. బాలిక అదృశ్యమై రోజులు గడుస్తున్నా ఆ ప్రాంతాన్ని మంత్రి సందర్శించకపోవడం మహిళల భద్రతపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. నిందితులు చిరుప్రాయంలోనే నేరప్రవృత్తి కలిగి ఉండటం శోచనీయమన్నారు.

జీపీఎస్ గెజిట్‌పై ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జీపీఎస్ అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం జరిగిన నిరసన కార్యక్రమంలో పట్టణ శాఖ కార్యవర్గ సభ్యులు ఈశ్వరరెడ్డి, పుల్లయ్యనాయక్, రవితేజ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తీసుకొచ్చి రాజపత్రాన్ని విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటిని వమ్ము చేస్తూ గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే గెజిట్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉపాధ్యాయులు నాగవెంకటేశ్వర్లు, గుర్రప్ప, జానీ బాషా పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. పుడమికి రక్ష

- పరీక్షలతో నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం



బోడెమ్మనూరులోని రైతు పొలంలో పరీక్షలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఉయ్యాలవాడ: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పొలంలో భూసార పరీక్షలు చేయడం వల్ల నేలలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. ఆ మేరకు ఎరువులు వినియోగించు వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గం అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయనిక ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వినియోగించడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోతోంది. చౌడు భారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక రసాయనిక లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

486 మట్టి నమూనాల సేకరణ



మండలంలో ప్రస్తుతం 486 మంది రైతుల వద్ద నుంచి మట్టి నమూనాలు సేకరించాం. పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపుతాం. భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదు పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది. పరీక్షల ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు రైతులు సాధించవచ్చు.

– రాజేంద్రకుమార్, మండల వ్యవసాయాధికారి

వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులు



డ్రోన్ ద్వారా పురుగు మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: వ్యవసాయ రంగంలో రైతులు సాంకేతిక పద్ధతులను అవలంభిస్తున్నారు. కాడెద్దులు పోయాయి.. ట్రాక్టర్లు వచ్చాయి. కొడవలితో వరి కోతలు పోయాయి.. వరి కోత మిషన్లు వచ్చాయి. తాజాగా పొలాల్లో క్రిమి సంహారక మందులను స్ప్రే చేయడానికి కూడా నూతన పద్ధతులు వచ్చాయి. డ్రోన్ ద్వారా పైర్లపై క్రిమి సంహారక మందులు, ట్రాక్టర్ డ్రమ్ము ద్వారా పొలాల్లో మందులు స్ప్రే చేయించుకుంటున్నారు. దీని వల్ల కూలీలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. పెట్టుబడిని కూడా తగ్గించుకోవచ్చు. అదే కూలీలతో స్ప్రే చేయించుకోవాలంటే ఇరువురు మనుషులు కావాలి. నీళ్ల పోసేందుకు, స్ప్రే చేయడానికి అవసరం. కాని కొత్త విధానంలో వారెవరూ అవసరం లేదు. కేవలం రైతు మాత్రమే ఇరువురు పని చేసుకుంటున్నారు. ఇప్పుడు మనిషికి రూ. 500 కూలీ లేనిదే పనికి రావడం లేదు.

బలిజలు బలోపేతం కావాలి



మంత్రులను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): బలిజలు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావాలని, వారికి కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. నంద్యాల బలిజ సంఘీయుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చే దిశలో అడుగులు వేయడం మొదలుపెట్టిందని తెలిపారు. శ్రీశైలం, అహోబిలం, మహానంది, యాగంటి, నవనందులు ఉన్న ఈ జిల్లా ఎంతో విశిష్టమైనదని, వీటన్నింటిని ఒక సాంస్కృతిక సర్క్యూట్ ప్రణాళికగా రూపొందించి నంద్యాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి విజయంలో కాపు, బలిజ సామాజిక వర్గాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ బలిజ సంఘీయుల కల్యాణ మంటపం పూర్తి కావడానికి అవసరమైన నిధులను కాపు కార్పొరేషన్ నుంచి ఇప్పించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను నంద్యాల బలిజ సంఘాల తరపున రామచంద్రారావు, రాజారాం, రవికృష్ణ, ఏవీఆర్ ప్రసాద్ ఘనంగా సత్కరించారు. టీడీపీ యువత జిల్లా అధ్యక్షుడు ఎన్ఎండీ ఫిరోజ్, జనసేన జిల్లా అధ్యక్షుడు చింతా శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానందిలో సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

మహానంది అభివృద్ధికి సహకరించండి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని మహానంది మండల జనసేన నాయకులు మారెడ్డి రామయ్య, చందు, మల్లికార్జున, గురునాథ్ తదితరులు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. నంద్యాల పట్టణానికి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి మహానంది ఆలయ విశిష్టతను వివరించారు. నంద్యాల జిల్లాలో శ్రీశైలం తర్వాత అతి పెద్ద ఆలయం మహానంది అని, మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మండలంలోని ప్రజలు సమస్యలపై ఆర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. కాచి వడబోసిన నీటినే తాగాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమ కాటు నుంచి రక్షణ పొందేందుకు దోమతెరలను వాడాలని చెప్పారు. ఆరోగ్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళకు వేధింపులు.. కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన ఓ మహిళను వేధిస్తున్న వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన మహిళను పక్కింటి వ్యక్తి సుబ్రమణ్యం దురుద్దేశంతో స్థలం విషయం సాకుతో నిత్యం వేధింపులకు గురిచేసేవాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడి ఎంపిక



విజయరావు

గోస్పాడు: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా విజయరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పీఆర్‌టీయూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు విజయరావు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాదరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి ఆధ్వర్యంలో తనను అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు చెప్పారు. గతంలో సభ్యుడిగా ఉన్న ఈయన మండల స్థాయి నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



చాగలమర్రి: కొలువుదీరిన ఇమాం హసేన్, ఇమాం హుసేన్ పీర్లు



పీర్ల ఊరేగింపులో భక్తులు



రుద్రవరం మౌలాలిస్వామి చావిడిలో కొలువుదీరిన పీర్లు

చాగలమర్రి: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం చాగలమర్రి పోలీస్‌స్టేషన్ సమీపంలోని మకాన్‌లో హజ్రత్ ఇమామ్ హసేన్, ఇమాం హుసేన్ పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మకానం నుంచి ప్రారంభమై మెయిన్ బజార్ మీదుగా అరబ్ మజ్జీద్, చిన్న మకానంలోని లాల్‌స్వామి మకానం వద్ద ఫాతెహాలు నిర్వహించి రచ్చబండ, పెద్దమకానం నుంచి మెయిన్ బజార్ మీదుగా సోమవారం తెల్లవారుజామున తిరిగి మకానానికి చేరుకుంది.

భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రుద్రవరం, అప్పనపల్లె, కొండమాయపల్లె, ఆర్.నాగులవరం, నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, మందలూరు, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, కోటకొండ తదితర గ్రామాల్లో పీర్ల చావిళ్లను విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు మేళతాళాలతో పీర్ల స్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల చావిళ్ల వద్ద భక్తుల కోలాహలం నెలకొంది.

పెద్దకంబలూరులో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

రుద్రవరం: పెద్దకంబలూరులో ఆదివారం రుద్రవరం పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దకంబలూరులో విష జ్వరాలపై సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరం ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట మందు పిచికారీ చేయించారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు తీసుకున్నారు. వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లారు.

ఘనంగా గంగుల బిజేంద్రారెడ్డి జన్మదినం



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రాఘవేంద్రారెడ్డి



రుద్రవరంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఆళ్లగడ్డ: మాజీ ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంగుల బిజేంద్రారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. యాదవాడ నరసింహారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రంలోని అమ్మవారిశాల సెంటర్‌లో ఆదివారం ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, యువకులు బాణసంచా పేల్చుతూ 10 కేజీల కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

దొర్నిపాడు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తుల క్రిష్ణయ్యయాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి(నాని) పుట్టిన రోజును ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

జోరుగా పత్తి సాగు



దొర్నిపాడులో విత్తన పత్తిని నాటుతున్న మహిళలు

దొర్నిపాడు. మండలంలో పత్తి సాగుకు ఆదివారం రైతులు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి మోస్తరు వర్షం కురవడంతో అదును దాటుతుందని విత్తనానికి సరపడా వానొచ్చిందని రైతులు సాగుకు సమాయాత్తం అయ్యారు. ఏటా మండలంలో 1065 హెక్టార్లకుపైగా విత్తన పత్తిని సాగు చేస్తారు. జిల్లాలోనే ఏటా అత్యధికంగా మండలంలోనే సాగు చేస్తారు. ఇక్కడి నేలలు పత్తిసాగుకు అనుకూలంగా ఉంటుంది. గతేడాది రైతులు విత్తనపత్తి సాగులో ఆశించిన స్థాయిలో లాభాలు ఆర్జించారు. ఈ సారి 400 హెక్టార్లు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

- లా అండ్ ఆర్డర్ అంటే ఎంటో చూపిస్తామన్న పవన్‌కల్యాణ్ ఎక్కడ?
- నందికొట్కూరులో సీపీఐ శ్రేణుల నిరసన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



పటేల్ సెంటర్‌లో నిరసన చేపట్టిన సీపీఐ నాయకులు

పగిడ్యాల: మైనర్ బాలిక ఆచూకీని కనిపెట్టడంలో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని కొత్త ఎల్లాల గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ.. ఆడుకోవడానికి వెళ్లిన తొమ్మిదేళ్ల బాలిక అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తున్నా ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి చేయడం లేదనేందుకు ఈ దర్యాప్తు సాక్ష్యమన్నారు. ప్రస్తుతం పోలీసు శాఖలో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా బాలిక ఆచూకీని ఎందుకు కనిపెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. గతంలో ఏ చిన్న సంఘటన జరిగినా ఒంటికాలిపై లేచే రాష్ట్ర హోంమంత్రి అనిత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. పేదల ప్రాణాలంటే అంత చులకనా అంటూ ఆవేదనను వెలిబుచ్చారు. ఎనిమిది రోజులుగా ఆ కుటుంబం ఎదుర్కొంటున్న మానసిక క్షోభ ప్రభుత్వానికి పట్టదా అంటూ నిప్పులు చెరిగారు.

టీడీపీ దుష్టరాజకీయం

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బాధితులను పరామర్శించేందుకు అతని స్వగ్రామానికి బయలుదేరితే మార్గంమధ్యలో అరెస్ట్ చేసి బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి రాజకీయం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మానవతా దృక్పథంతో పరామర్శించడం నేరమన్నట్లు ఊర్లోకి వెళ్లకుండా నిలువరించడం టీడీపీ దుష్టరాజకీయానికి తార్కాణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ఎల్లాల గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై అఘాయిత్యం ఘటనలో ప్రజాసంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కోకిల రమణారెడ్డి, కాటం రమేష్ కుమార్‌రెడ్డి, రమణ, మండ్ల మురళీ, కురుమన్న, సీపీఎం నాయకులు రాజు తదితరులు ఉన్నారు.

వరుస అఘాయిత్యాలపై చర్యలేవీ?

నందికొట్కూరు: అధికారంలోకి వస్తే లా అండ్ ఆర్డర్ అంటే ఏమిటో చూపిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడ అని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి, సీపీఐ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రజిత ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ముచ్చుమర్రి సంఘటన, విజయనగరం జిల్లాలో జరిగిన సంఘటనలపై సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఎం డౌన్‌డౌన్, డిప్యూటీ సీఎం డౌన్‌డౌన్, హోంమంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముచ్చుమర్రిలో బాలిక సంఘటన మరువకముందే విజయనగరం జిల్లాలో 5 నెలల బాలికపై వృద్ధుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై ఏమి చర్యలు తీసుకున్నారో పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాలికలు, పసికందులు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా మొద్దునిద్ర వీడరా అని ప్రశ్నించారు. ముచ్చుమర్రి ఘటనలో 8 రోజులు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.